ఈ రెండు నెలల్లో ప్రభాకర్ మూడు దఫాలు వచ్చేడు. ఎప్పుడూ, మాధవీ, ప్రభాకర్ యిద్దరొకేసారి రాలేదు.

లచ్చుమమ్మకు లీలగా అర్థమవుతోంది. గానీ, ఏంచేయాలో తెలీక సతమత మవుతోంది. కొడుకూ, కోడలూ ... బయటపడకుండా గడుపుకొస్తున్నా ఘర్షిస్తున్నారని గ్రహించింది. గానీ, తను కల్పించుకొని, ఏం చెప్పాలో అర్థంగాక తపనపడసాగింది. మూడో నెల మధ్యలో ప్రభాకర్ లాంగ్‌లీవ్ పెట్టి వచ్చేసాడు.

"...నన్ను నేరస్థురాల్ని చెయ్యటానికా?" మూడో దఫా వచ్చినపుడు, విషయం తెలిసి, అత్తయ్య ఎదుటనే తగవుకి దిగింది మాధవి.

"కొన్నాళ్ళు యిక్కడ వుండాలన్పించింది. మనసు బాగోలేదు. వచ్చేను..." ప్రభాకర్, నిజంగా, ఆ కారణంగానే వచ్చేడు.

"ఈ ఊరి వాళ్ళ వద్దా, అత్తయ్య వద్దా నన్ను దోషిని చెయ్యాలనే, ఇలా చేసారు. మనసు మీవొక్కరికేనా? నేనెంత దహించుకు పోతున్నానో, ఎవరికి చెప్పుకోను..." గొంతులో దుఃఖం పొంగి, మాధవి కళ్ళల్లో నీళ్ళు కదలాడేయి.

"...ఇపుడేటయ్యిందమ్మా! రెండు రోజులుండి, ఆడే ఎళ్తాడు..." సర్దిచెప్పింది లచ్చుమమ్మ.

"కాదు, ఆవిడగారి ట్రైనింగయ్యేదాకా యిక్కడే వుంటాను..." ప్రభాకర్ నిర్ణయాన్ని చెప్పాడు.

"...ఇలాంటి ఫీట్స్ ... నాచేత ట్రైనింగ్‌ని డిస్‌కంటిన్యూ చేయించలేవు" మాధవి స్థిరంగానే పలికింది, లోలోపల వ్యధపడ్తున్నా...

"నీకన్నీ ఫీట్స్ అన్పిస్తాయి. ఫీలింగ్స్ ఎపుడర్థమయ్యాయి?"

ఆ మాటతో, ఎక్కడో గట్టు తెగింది. దుఃఖమంతా భళ్ళున వొలికింది.

"...అవును. నాకు ఫీలింగ్స్ అర్థం కావు. నాలో ఫీలింగ్స్ లేవు. హరించుకు పోయేయి. ఎందుకు హరించుకుపోయేయో? ఎపుడు హరించుకుపోయేయో యిప్పుడు తెలిసింది. నువ్వే, నువ్వే నా ఫీలింగ్స్‌ని హరించేసావ్..." భోరున ఏడుస్తూ, గోడకు చేరబడింది మాధవి.

మనసెరిగిన మనిషితో సహజీవనం, సాఫీగా సాగిపోతుందనుకుంది మాధవి. ప్రేమించి పెళ్ళి చేసుకున్న ... తమ మధ్య... ఇంతటి అగాధం వుంటుందనుకోలేదు. ఇంటిపనీ, వంటపనీ, ఎంత భారం? ఆ భారం ... ఏమాత్రం మోస్తున్నాడు ప్రభాకర్? తను మోసే భారంలో ఎంతశాతం? ఆ భారం నుంచి కొంత వెసులుబాటు కోసం కొన్ని కన్స్యూమర్ గూడ్స్ కొన్నపుడు వాటి కోసం ... ఘర్షణ.

